
# సాక్షి చిత్తూరు

శుక్రవారం । 17 । మే । 2024




## విద్యుత్ తీగపై పడిన రైల్వేగేట్

పుత్తూరు ఆర్‌డీఎం వద్ద ఉన్న రైల్వే లిఫ్ట్ గేట్‌ను కంటైనర్ లారీ లాక్కునిపోవడంతో విద్యుత్ తీగలపై పడింది. - 8లో



## శోభాయమానం

తిరుపతి గంగ జాతరలో భాగంగా గురువారం అమ్మవారికి సారె సమర్పణ శోభాయాత్ర వైభవంగా సాగింది. - 8లో



## మూడంచెల భద్రత

జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. - 8లో

## న్యూస్‌రీల్

### భద్రత కట్టుదిట్టం



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

**చిత్తూరు కలెక్టరేట్ :** కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన గురువారం ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 4 వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపం ఉండకూడదని ఆదేశించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటల పాటు సిబ్బంది, పోలీసులు విధులు నిర్వర్తించాలని తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో టేబుల్స్, సీసీ కెమెరాలు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు, ఏజెంట్లు కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీక్షించే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్లు నరసింహులు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### ట్యాంకర్లతో నీటి సరఫరా

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలోని 9 ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు. పులిచెర్లలో 4, గుడుపల్లెలో 5 ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాలోని 480 ప్రాంతాల్లో బోర్, పైప్‌లైన్ మరమ్మతులు చేసి, నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



రూపిక చరిత యుషిక

పిల్లలను బలితీసుకొన్న గూకూరు చెరువు

# ఆరిపోయిన ఇంటి దీపాలు
# ఆగని కన్నీటి సుడులు

"నీలకంఠా.. నిన్ను సేవించుకోవడానికి వస్తే నట్టేట ముంచేశావు కదయ్యా.. నీకు దీపం పెడదామని వస్తే మా ఇంటి దీపాలు ఆర్పేస్తావా... నీకిది న్యాయమా.." అంటూ ఆ తల్లి శోకించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న ముగ్గురు కుమార్తెలు జలకంఠేశ్వర స్వామికి దీపారాధన చేసేందుకు చెరువులో దిగారు. అంతే అమ్మాయిలు ఒకరి తరువాత ఒకరు చెరువులో పడిపోయారు. బిడ్డలను కాపాడేందుకు ఆ తల్లి చేసిన ప్రయత్నం వృథా అయింది. కన్నబిడ్డలు కళ్లముందే మునిగిపోవడంతో ఆ తల్లి కడుపుకోతతో విలవిల్లాడిపోయింది. గుండె పగిలేలా ఏడ్చిన ఆ తల్లి కన్నీరే చెరువైంది.



రోదిస్తున్న తల్లి విజయ



బిడ్డలను కాపాడుకోవడానికి ఆటోలో తరలివస్తూ..

- నీకు దీపారాధన చేస్తే మా ఇంటి దీపాలు ఆర్పేస్తావా?
- చెరువులో ముగ్గురు అక్కచెల్లెళ్ల దుర్మరణం
- తల్లి చూస్తుండగానే మునిగిపోయిన కుమార్తెలు
- కాపాడేందుకు చేసిన తల్లి ప్రయత్నం వృథా

**పుత్తూరు:** జలకంఠేశ్వరస్వామికి పూజలు చేసి, చెరువులో దీపాలు పెట్టేందుకు వెళ్లిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు నీట మునిగి దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద సంఘటన వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే, ఎస్బీఆర్‌పురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ పి.బాబు, విజయ దంపతులకు రూపిక(10), చరిత(13), యుషిక(17) ముగ్గురు కుమార్తెలు. ఆ దంపతులిద్దరూ శివభక్తులు. ఈ క్రమంలో నీలకంఠుడ్ని సేవించడానికి తిరుణామలై వెళ్లాడు. విజయ తన ముగ్గురు కుమార్తెలతో గురువారం మధ్యాహ్నం గూకూరు చెరువు కట్టపైన ఉన్న శివుని గుడికి వచ్చి పూజలు చేసింది. పూజల అనంతరం ముగ్గురు కుమార్తెల చేతికి దీపాలు వెలిగించి ఇచ్చి చెరువులో వదలమని చెప్పింది. చెరువు మెట్లపై పాచి పట్టివుండడంతో కాలు జారి ఒకరి వెనక మరొకరు చెరువులోకి పడిపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన విజయ కేకలు వేస్తూ పిల్లలను రక్షించేందుకు చెరువులోకి దిగేసింది. అయితే అప్పటికే ముగ్గురు పిల్లలు మునిగిపోయారు. చుట్టుపక్కల ఉన్న వారు వచ్చి విజయను మాత్రం రక్షించగలిగారు. మునిగిపోయిన పిల్లలను వెలికి తీసి పుత్తూరు ఆస్పత్రికి ఆటోలో తరలించారు. వైద్యులు పరీక్షించి ముగ్గురూ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ మేరకు వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆమె రోదనకు హద్దే లేదు

మేమేమి పాపం చేశాం? ఇంత శిక్ష ఎందుకేశావు శివా అంటూ ఆ తల్లి రోదనలతో పుత్తూరు ఆస్పత్రి మార్మోగి పోయింది. నిన్నే నమ్మితే నీట ముంచావు కదయ్యా.. నీ కోసం దీపాలు తెస్తే.. మా ఇంటి దీపాలనే ఆర్పేశావు కదయ్యా... నన్ను తీసుకొనిపోయి, నా బిడ్డల్ని వదిలేసి ఉంటే ఏమయ్యా అంటూ ఆ తల్లి విలపించింది. ఈ ఘటనతో ఎస్బీఆర్‌పురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### ముగ్గురూ ఆడపిల్లలైనా..

ఆర్‌ఎంపీ డాక్టర్‌గా గ్రామస్తులకు వైద్య సేవలందిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకుడిగా ప్రజా సేవ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న బాబుకు ముగ్గురూ కుమార్తెలే. అయినా వారికి ఏ మాత్రం తక్కువ చేయకుండా ఎంతో సంతోషంగా అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ముగ్గురినీ పెద్ద చదువులు చదివించి, పెళ్లిళ్లు చేసి పంపాలని ఆశించారు. ఈ క్రమంలో చిన్న కుమార్తె రూపిక 5వ తరగతి, రెండవ కుమార్తె చరిత 9వ తరగతి చదువుతుండగా, పెద్ద కుమార్తె యుషిక ఈ సారి ఇంటర్మీడియట్‌లో 900కు పైగా మార్కులు సాధించింది. బీటెక్ చదివించాలని కాలేజి అన్వేషణలో ఉండగా ఈ దుర్ఘటన ఆ కుటుంబాన్ని చిదిమేసింది. శివ భక్తులైన ఆ దంపతులు, శివుని సేవలోనే సర్వం కోల్పోయారు.

## అమలులో 144 సెక్షన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులోనే ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇది అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఐపీసీ సెక్షన్ 141 ప్రకారం చట్టవిరుద్ధంగా సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ర్యాలీలు చేయకూడదని తెలిపారు. తుపాకులు, కత్తులు, రాళ్లు, కర్రలు ఇతర ఆయుధాలు తీసుకెళ్లడం నిషిద్ధమని చెప్పారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఒకే చోట ఉండకూడదని ఆయన వెల్లడించారు.

## కాణిపాకంలో ఆర్టీఐ కమిషనర్ సునీల్



కమిషనర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని గురువారం ఆర్టీఐ కమిషనర్ సునీల్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి, దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, అధికారులు కోదండపాణి, సత్యంరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## 19 నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు



పెంచలకోన క్షేత్రం

**రాపూరు:** మండలంలోని పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయి. 19న ఉత్సవ మూర్తులు గోనుపల్లి నుంచి పెంచలకోనకు చేరుకోనున్నారు. ఆ తర్వాత బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ గావిస్తారు. 20న ధ్వజారోహణం, సాయంత్రం స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం, శేష వాహనం, 21న ఉదయం హంస వాహనం, సాయంత్రం బంగారు హనుమంత వాహనం, 22న ఉదయం సింహ వాహనం, రాత్రి బంగారు గరుడ వాహన సేవ, 23న కల్యాణం, రాత్రి రథోత్సవం, గజ వాహనసేవ, 24న ఉదయం చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రి అశ్వ వాహనసేవ, 25న స్వామి,అమ్మవార్లు గొనుపల్లికి వేంచేపు, క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

# థామస్‌ది రౌడీ రాజకీయం




విలేకరులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- పోలింగ్ రోజు బౌన్సర్లంటూ రౌడీలను తీసుకొచ్చారు
- తమిళనాడు నుంచి 300 మందిని రప్పించారు
- సమావేశంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ రౌడీ రాజకీయం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చరిత్రలో ఇంత నీచమైన రాజకీయం ఎప్పుడూ చూడలేదన్నారు. టీడీపీ అభ్యర్థి థామస్ అల్లాగుంట పేరునే చెడిపేస్తున్నారన్నారు. మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌కు థామస్ 300 మంది రౌడీలను బౌన్సర్లుగా దింపారని చెప్పారు. వారితో బూత్‌ల వద్ద దౌర్జన్యాలు, దాడులకు దిగారని గుర్తుచేశారు. ఎస్సీ కుటుంబాలపై దాడులు చేయించారని ఆరోపించారు. పుల్లూరు దళితవాడలోని నాలుగు ఇళ్లను ధ్వంసం చేశారని మండిపడ్డారు. దీనిపై ఎస్పీ, డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులంతా టీడీపీ నేతలకే కొమ్ము కాశారని, ఎన్నికల కమిషన్ కూడా ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. మునస్వామి అనే వ్యక్తి థామస్‌గా పేరు మార్చుకుని ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు దండుకోవడానికి ఏటీఎం కార్డుల పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి యత్నించారని చెప్పారు. ఇలాంటి నీచరాజకీయాలు చేసే వ్యక్తులకు రాజకీయ భవిష్యత్ ఉండదన్నారు. ఇక చంద్రబాబు అయితే ఎస్సీలను శత్రువులాగా చూస్తారన్నారు. దళితులను ఓట్లు అడిగేందుకు కూడా బాబు అసహ్యించుకుంటారని తెలిపారు. ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబుకు జరిగిన ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. జగనన్న సంక్షేమాన్ని చూసి ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రజలంతా మళ్లీ జగనన్న నాయకత్వాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. జూన్ 4వ తేదీన జరిగే ప్రజల నిర్ణయం తెలుస్తుందని, కచ్చితంగా మళ్లీ జగనన్న సీఎం అవుతారని స్పష్టం చేశారు. అనంతరం జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని మీడియాకు పూర్తిస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పురం జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ జనార్దన్, మండల అధ్యక్షుడు మణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చిత్రలేఖనం చాలా బాగుంది



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ దేవరాజు

**చిత్తూరు కలెక్టరేట్ :** వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు గీసిన చిత్రలేఖనం బొమ్మలు చాలా బాగున్నాయని డీఈఓ దేవరాజు అభినందించారు. జిల్లా కేంద్రంలోని తపో వనం సంస్కృతోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న బాపు బాలభవన్ చిత్రలేఖనం వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు శిబిరంలో శిక్షణ పొంది నైపుణ్యాలను పెంచుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేసవి శిక్షణా శిబిరం శిక్షకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.





## క్షయ నివారణే లక్ష్యం




వ్యాక్సినేషన్ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** ప్రభుత్వం క్షయ నివారణే లక్ష్యంగా పనిచేస్తోందని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం సత్యనారాయణపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం అడల్ట్ బీసీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందస్తుగా గుర్తించిన వ్యక్తులకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సినేషన్ వేస్తారన్నారు. మధుమేహం, ధూమపానం చేసే వారికి, టీబీ మందులు వాడిన వ్యక్తులకు, టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబీకులకు, 60 ఏళ్లు పైబడినవారికి బీసీజీ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తారన్నారు. ప్రతి గురువారం కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సినేషన్‌ను వేస్తారన్నారు. దీన్ని ప్రజలు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, వైద్యాధికారులు సాయి షర్మిల, శిరీష, గుణశేఖర్, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

**563 కేంద్రాల్లో వ్యాక్సినేషన్**

జిల్లా వ్యాప్తంగా 563 కేంద్రాల్లో వంద శాతం పూర్తయిం దని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. 60 ఏళ్లు పైబడిన 6,460 మందికి, ధూమపానం చేస్తున్న 2,000 మందికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు 4,529 మందికి, టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబంలోని 2136 మంది వ్యాక్సినేషన్ వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**క్షయవ్యాధి నివారణకు బి.సి.జి టీకాలు**

**తవణంపల్లె:** క్షయవ్యాధి నివారణకు బి.సి.జి టీకాలు తప్పని సరిగా వేయించాలని క్షయ వ్యాధి నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్‌నాయక్ తెలిపారు. గురువారం మండలంలో బి.సి.జి టీకాలు వేసే కార్యక్రమానికి మొట్టమొదటి సారిగా శ్రీకారం చుట్టారు. మండలంలోని కె.పట్నం, తవణంపల్లె, దిగువమాఘం సచివాలయాల్లో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని ఆయనతోపాటు సిహెచ్ కిరణ్‌కుమార్ రెడ్డి, జిల్లా క్షయవ్యాధి నివారణ డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం దిగుమాఘం సచివాలయంలో డాక్టర్ సునీల్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి గురువారం తప్పకుండా బీసీజీ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించాలన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేసిన వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలని వివరించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్ మండలంలో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, నిర్మల, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడంచెల భద్రత

సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు తీర్పు నిక్షిప్తమైన ఈవీఎంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా 18 రోజులు సమయం ఉంది. అప్పటివరకు ఈవీఎం, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలకు బందోబస్తు పకడ్బందీగా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల నుంచి ఈవీఎం యంత్రాలను జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తరలించి వాటిని స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. కౌంటింగ్‌కు ఇంకా సమయం ఉండడంతో ప్రజా తీర్పును అంచనా వేయడంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

- ఈవీఎంలలో నిక్షిప్తమైన ప్రజా తీర్పు
- పోలింగ్ తీరుపై బూత్‌లు, మండలాల వారీగా విశ్లేషణ
- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు



స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న సిబ్బంది

**చిత్తూరు కలెక్టరేట్ :** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కట్టుదిట్టమైన భద్రతతో పాటు నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలో ఉంచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24 గంటల పాటు రక్షణగా ఉండేలా ఏర్పాటు చేశారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు అమర్చారు. భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించే అవకాశం సదరు రిటర్నింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది.

**స్ట్రాంగ్ రూం పరిసరాల్లో 144 సెక్షన్**

ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది. ఓటింగ్ యంత్రాలు భద్రపరిచేందుకు ప్రత్యేక సదుపాయాలు ఉన్న గదిని ఎంచుకుని డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సాధారణంగా స్ట్రాంగ్ రూంలకు ప్రవేశ ద్వారం ఒక్కటే ఉంటుంది. ఇతర మార్గాల ద్వారా చేరుకోవడానికి వీలు పడదు. పోలింగ్‌లో ఉపయోగించిన బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లతో పాటు విలువైన పత్రాలను భద్రంగా ఉంచేలా స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు.

**కంట్రోల్ రూం ద్వారా నిఘా**

ఈవీఎంల భద్రతకు అమర్చిన సీసీ కెమెరాలు అందించే దృశ్యాలను కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు సైతం వాటిని పరిశీలించడానికి అవకాశం ఉంటుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. సీసీ కెమెరాల నిర్వహణకు నిరంతర విద్యుత్ అవసరం. కరెంట్ కోతలు లేకుండా స్థానిక విద్యుత్ బోర్డు సహకరిస్తోంది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక యంత్రాలతో పాటు జనరేటర్ సౌకర్యం కూడా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నత స్థాయి అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అక్కడికి అనధికార వ్యక్తుల వాహనాలకు అనుమతిని నిషేధించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లను ఓటర్ పెరిమీటర్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆర్‌ఓలు ఇన్నర్ పెరిమీటర్ వరకు మాత్రమే వెళ్లాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

**కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం**

జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగేవరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో నిరంతర పోలీసు పహారా ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూంలో అమర్చిన సీసీ టీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి వాటి దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సీసీ టీవీ కవరేజ్‌తో సహా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించడానికి గెజిటెడ్, పోలీసు అధికారులు 24 గంటలు విధుల్లో ఉండే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంల సెక్యూరిటీ, కారిడార్ మొదలైన వాటి సీల్డ్ డోర్లను కవర్ చేసే విధంగా సీసీ టీవీ కవరేజీ, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారాల వద్ద విజిట్ చేసిన అధికారులు సంతకాలు చేసేందుకు లాక్ బుక్ (రిజిస్టర్లు) ఏర్పాటు చేశారు.

**ఈవీఎంలలోనే తీర్పు**

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత మూడు నెలలుగా ఎన్నికల్లో గెలుపు కోసం హోరా హోరీగా అభ్యర్థులు పోరాడారు. ఇప్పుడు ఫలితాల కోసం జూన్ 4 వ తేదీ కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు గెలుపు తమదేనని ధీమాతో ఉండగా, మరికొందరిలో ఆందోళన ఉంది. పోలైన ఓట్లల్లో తమకు ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉందనే దానిపై అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. నియోజకవర్గాలు, గ్రామాల వారీగా లెక్కలు తెప్పించుకుంటున్నారు. పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారితో సమావేశమై పరిస్థితులు ఆరా తీస్తున్నారు. ఓటర్ల మూడ్ ఎలా ఉంది. ఎటు వైపు మొగ్గు చూపారు. తదితర అంశాలను రాబట్టేపనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

**రిలాక్స్‌గా అధికార యంత్రాంగం**

పోలింగ్ ఈ నెల 13వ తేదీ ముగిసింది. పోలింగ్ ముగిశాక ముఖ్యమైన కసరత్తు ఈవీఎం యంత్రాలను జాగ్రత్తగా కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలకు చేర్చడం. ఈ ప్రక్రియను ఈ నెల 15 వ తేదీ వరకు అధికారిక యంత్రాంగం పకడ్బందీగా చేపట్టింది. ఏడు నియోజకవర్గాల యంత్రాలను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచే ప్రక్రియను ముగించింది. కౌంటింగ్‌కు 18 రోజులు సమయం ఉండడంతో అధికార యంత్రాంగం కాస్త రిలాక్స్‌గా ఉంది.

# మృతుల కుటుంబాల్లో తీరని విషాదం

**బంగారుపాళెం:** కూలి పనులకు వెళితేగానీ బతుకు సాగని కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం తీరని విషాదం నింపింది. మండలంలోని మొగిలి ఘాట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కీరమంద గ్రామానికి చెందిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఇద్దరు మృతి చెందారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారందరూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతుకు వరిగడ్డి తీసుకువచ్చేందుకు అదే గ్రామానికి చెందిన వేణుగోపాల్, రాజా, నాగభూషణం, రాజయ్య, జయచంద్ర, బాబు కూలీలుగా ట్రాక్టర్‌లో చౌడేపల్లె మండలం రాయలపేటకు వెళ్లారు. వరిగడ్డి లోడుతో వారు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మొగిలి వద్ద ట్రాక్టర్‌ను కట్టెల లోడ్డుతో కర్ణాటక నుంచి చిత్తూరు పోతున్న లారీ ఢీకొనడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో రాజా బంగారుపాళెంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరేళ్ల క్రితం రాజాకు వివాహమైంది. పిల్లలు లేరు. వేణుగోపాల్ పలమనేరు ఏరియా ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఆడపిల్లలకు పెళ్లయిపోయింది. పోలీసులు గురువారం రోడ్డు ప్రమాద మృతులకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోడ్డు ప్రమాద సంఘటన కీరమంద గ్రామంలో విషాదాన్ని నింపింది. కూలి చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే ఇంటి యజమానులు విగత జీవులుగా, క్షతగాత్రులుగా మారిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రెండు వాహనాలు ఢీ: ఒకరి మృతి

**గుడిపాల:** రెండు ఐషర్ వాహనాలు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం మేరకు, హైదరాబాద్ నుంచి తమిళనాడులోని చెన్నై సమీపంలోని పుదుపెట్టైకు ఐషర్ వాహనం బయల్దేరింది. చెన్నై నుంచి బెంగళూరుకు మరో ఐషర్ వాహనం బయల్దేరింది. ఈ రెండు వాహనాలు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై నరహరిపేట చెక్ పోస్ట్ సమీపంలోని భద్రకాళమ్మ గుడి వద్ద ఉదయం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఇందులో పాండిచ్చేరికి చెందిన సుదర్శన్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. షాక్‌దావిద్ అనే మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన డ్రైవర్ సుదర్శన్‌ను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


తీవ్రంగా గాయపడ్డ షాక్ దావిద్


మృతి చెందిన డ్రైవర్ సుదర్శన్

# వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు


రక్షణ కోసం జరుగుతున్న ట్రెంచ్ పనులు


కెమెరాలో రికార్డు అయిన జంతువుల సంచారం

- నగర వనంలో సోలార్ సిస్టమ్ సీసీ కెమెరాలు
- ఎఫ్‌ఆర్వో థామస్ వెల్లడి

**చిత్తూరు కార్పొరేషన్:** అటవీ రక్షణ సంరక్షణ పనులు చేస్తున్నామని ఈస్ట్ ఎఫ్‌ఆర్వో థామస్ తెలిపారు. ఆయన గురువారం పలు అంశాలపై మాట్లాడారు. చిత్తూరు నగరవనంలో 13 సోలార్ సిస్టమ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అదే విధంగా ట్రాక్ కెమెరాలు 4 ఏర్పాటు చేశామన్నారు. తద్వారా మనుషులు, జంతువుల కదలికలను రికార్డు చేసి ఫొటోలను ఎప్పటికప్పుడు అనుసంధానం చేసిన మొబైల్‌కు పంపుతుందన్నారు. ఈ రెండు రకాల కెమెరాలను మొబైల్ ద్వారా మానిటరింగ్ చేయవచ్చన్నారు. స్మగ్లింగ్ నివారణ, వన్యప్రాణుల రక్షణ కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా రూ.8.07 లక్షలతో నగరవనం చుట్టూ భద్రత కోసం 3 కిలోమీటర్లు ట్రెంచ్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. దీనివల్ల అటవీలోని జంతువులు బయటకు వెళ్లలేవన్నారు. బయట నుంచి జంతువులు లోనికి రాలేవన్నారు. కుక్కల బెడద ఎక్కువ కావడంతో దుప్పులు జనారణ్యంలోకి వస్తున్నట్లు వివరించారు. అందుకే డాగ్‌బోన్లు పెట్టి అందులో చిక్కిన కుక్కలను తమిళనాడు సరిహద్దులో వదిలిపెడుతున్నమన్నారు. రేంజ్ పరిధిలో రూ.9 లక్షలతో సాసర్‌పిట్లు మరమ్మతు చేశామన్నారు. మొత్తం 38 సాసర్‌పిట్లలో జంతువుల దాహార్తి కోసం నీరు నింపుతున్నట్లు స్పష్టం చేశారు. ఒంటరి ఏనుగును పూతలపట్టు నుంచి తిరుపతి జిల్లా అడవిలోకి పంపామన్నారు.

# ఇదిగో ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటున్నా

- భార్య, అక్కకు వీడియో కాల్
- రైలు కింద పడి అటెండర్ ఆత్మహత్య

**కుప్పం:** స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న నరేంద్ర మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు, మదనపల్లె సమీపంలోని బసినికొండకు చెందిన నరేంద్ర మూర్తి (40) శాంతిపురం మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. గురువారం కుప్పం రైల్వే స్టేషన్‌కు వచ్చి భార్య కల్పన, అక్క సుజాతకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకోవాల్సిన రూట్‌ను వీడియో కాల్‌లో చూపించినట్లు తెలిసింది. అనంతరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహానికి కుప్పం వంద పడకల ఆస్పత్రిలో పంచనామా చేసి, బంధువులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

# పంటలపై ఏనుగుల దాడి

**వి.కోట:** చేతికొచ్చిన పంటలను ఏనుగులు తొక్కి నాశనం చేసిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని నాయకనేరి గ్రామ రైతులకు చెందిన అరటి, వరి, టమాట పంటలపై మూడు ఏనుగుల గుంపు దాడి చేసింది. కోతదశలో ఉన్న వరి పంటను, అరటి తోటను తొక్కి నాశనం చేశాయి. అటవీ అధికారులు మాట్లాడుతూ మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల సంచారంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి తోట

# రోడ్డు ప్రమాదంలో జేసీబీ డ్రైవర్ మృతి

**పాలసముద్రం :** గుర్తుతెలియని వాహనం ఢీకొని జేసీబీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మండలంలోని నరసింహాపురం పంచాయతీ బలిజూరుకు చెందిన జానకిరామన్(52) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తమిళనాడు సరిహద్దులోని పలేరి గ్రామంలో భూమి చదును చేసిన తరువాత ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారమందుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు.

# అడుగడుగునా టీడీపీ గూండాగిరి

- ఓటమి భయంతోనే టీడీపీ దాడులు
- వైఎస్సార్‌సీపీ నాయకులను రక్తమొచ్చేలా కొట్టారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** అబద్ధాలు చెబుతూ, ఆత్మరక్షణ పేరుతో టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అడుగడుగునా గూండాగిరికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ మండిపడ్డారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మురళీమోహన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మాదిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ పచ్చమూకలతో అల్లర్లు సృష్టించారన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను తీవ్రంగా కొట్టి గాయపరిచారని చెప్పారు. దాడి చేసిన వ్యక్తిని వదిలి ఆత్మ రక్షణ అంటూ అబద్ధాలు చెబుతూ, వాస్తవాలను దాచేస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీకి ఓట్లు పడలేదనే అక్కసుతో రాళ్ల దాడులు చేస్తూ ఓటర్లను భయపెట్టారని పేర్కొన్నారు. యాదమరిలో ఆయన మంచి పేరు సంపాదించుకున్నారని, అటువంటి వ్యక్తిపై బురదజల్లాలని చూస్తారన్నారు. బంగారుపాళెం మండలం నలగాంపల్లెలో కొన్నేళ్లుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగలేదన్నారు. ప్రజలు సరిగ్గా ఓట్లు వేసిన పాపానపోలేదన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఓటర్లు తిరగబడి స్వచ్ఛందంగా ఓటు వేశారని చెప్పారు. దీన్ని జీర్ణించుకోలేని తమ్ముళ్లు కాపు కాసి దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేవారు. ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచి, ఆత్మరక్షణ కోసం కొట్టామని చెప్పడం దుర్మార్గమన్నారు. అలాగే పేట అగ్రహారం పోలింగ్ బూత్‌లో రవినాయుడును రక్తమొచ్చేలా కొట్టారన్నారు. కమ్మగుట్టపల్లిలో గురస్వామినాయుడును తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు ఈ దాడులు చేయించారని పేర్కొన్నారు. ప్రజలు చంద్రబాబును ఈసారీ ఇంటికి పంపిస్తున్నారని..మురళీ మోహన్ కూడా తిరుపతికి వెళ్లి సొంత పనులు చూసుకోవచ్చని ఎద్దేవా చేశారు. వైస్ జెడ్పీ చైర్మన్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ యాదమరిలో తాము అరాచకాలు చేస్తున్నట్లు, టీడీపీ అభ్యర్థి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమన్నారు. చంద్రబాబు నుంచి కిందిస్థాయి నాయకుల వరకు అబద్ధాలు చెప్పడం అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో మోర్ధానపల్లి సర్పంచ్ మహిళ అని కూడా చూడకుండా టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా కొట్టారని పేర్కొన్నారు. దీనిపై తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మాదిరెడ్డిపల్లిలో టీడీపీకి ఓట్లు పడకపోవడంతో దౌర్జన్యం చేశారని చెప్పారు. మళ్లీ అక్కడ రాళ్ల దాడి చేసి పోలీసులను కూడా గాయపరిచారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవి, జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు పరందమాన్, శేఖర్, తులసిరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలపై పడిన రైల్వే లిఫ్ట్‌గేట్

**పుత్తూరు:** పట్టణంలోని ఆర్డీఎం రైల్వే గేటు నెంబర్ 56 వద్ద గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో చిత్తూరు నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లిఫ్ట్ గేట్‌ను ఈడ్చుకొంటూ వెళ్లింది. దీంతో లిఫ్ట్‌గేట్ హైపవర్ విద్యుత్ లైన్‌పై పడి మంటలు చెలరేగాయి. స్థానికులు కేకలు వేయడంతో గేట్‌మెన్ పుత్తూరు రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే అధికారులు 3 గంటల పాటు శ్రమించి లిఫ్ట్ గేటును సరిచేసి, రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఆ లిఫ్ట్ గేటు తరచూ మరమ్మతులకు గురికావడం, ప్రమాదాలు చోటు చేసుకోవడం రివాజుగా మారిందన్న విమర్శలు ఉన్నాయి.


విద్యుత్ తీగలపై నుంచి లిఫ్ట్ గేట్‌ను తొలగిస్తున్న రైల్వే సిబ్బంది

# శోభాయమానం

**తిరుపతి కల్చరల్:** 'గంగమ్మ తల్లి.. వెంకన్న చెల్లి.. జాతరో జాతర.. వేషాలు వేయరా.. మొక్కులు తీర్చరా.. అమ్మ కరుణను పొందరా..' అంటూ అత్యంత ప్రతిష్టాత్మకంగా కరుణన్న సంకల్ప ప్రచారాలతో తిరునగరిలో గురువారం జాతర సంబరాలు జోరందుకున్నాయి. తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి సారె సమర్పించారు. ఇందులో భాగంగా పద్మావతీపురంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన సంప్రదాయ సారె పూజలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులు, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి దంపతులు, శ్వేత డైరెక్టర్ భూమన్ దంపతులు, భూమన కుటుంబీకులు సారెను నెత్తిన పెట్టుకొని భక్తి శ్రద్ధలతో కాలినడకన శోభాయాత్రగా ముందుకు కదిలారు. వివిధ దేవతామూర్తులు, అమ్మవారి విశ్వరూప కళాప్రదర్శనలు, లయబద్ధంగా నృత్యాల హోరుతో తిరుపతి పురవీధులు పులకించాయి. పద్మావతీపురం నుంచి శ్రీనివాస కల్యాణ మండపాలు, లక్ష్మీపురం సర్కిల్, ఎస్టీవీ నగర్, డీఆర్ మహల్, రైల్వేస్టేషన్, గ్రూప్ థియేటర్స్, పెద్దకాపు వీధి మీదుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర శోభాయాత్ర సాగింది. భక్తులు హారతులు సమర్పించారు. ముస్లింలు గంగమ్మసారెపూ చూపిన భక్తి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.


తిరుపతిలో వైభవంగా సాగుతున్న శోభాయాత్ర